

# శ్రీ కల్యాణీయం

## – సింగీతం లక్ష్మి కల్యాణి




విశేషమైన ఖ్యాతి గడించిన సినీదర్శకుడి భార్య ఐనప్పటికీ ,

సాధారణ గృహిణిగా ఎదుగుతూ

కుటుంబాన్ని అందంగా తీర్చిదిద్దుకున్న ఓ మహిళ స్ఫూర్తిదాయకమైన ఆత్మకథ..!!

(ప్రారంభం)

ఓ భర్త రియాక్షన్



ఒకరోజు కల్యాణి నా దగ్గరికొచ్చి మా రెండవ అమ్మాయి ఒక మంచి ఐడియా ఇచ్చిందనీ, దాన్ని పెద్దమ్మాయి కూడా సపోర్ట్ చేసిందనీ చెప్పింది. తన జీవిత విశేషాలను ఒక పుస్తకంగా రాస్తే బాగుంటుందంటున్నారట. నాకు బ్రహ్మాండంగా నచ్చేసింది. "ఈరోజే మొదలెట్టెయి" అన్నాను. అసలు నేను దాన్ని ప్రోత్సహించడానికి వేరే కారణం ఉంది. కల్యాణి నాలుగైదు మేజర్ ఆపరేషన్లను ఎదుర్కొంది. ఎన్నో హెల్త్ ప్రోబ్లమ్స్. అయినా ఏ రోజూ లోని బాధను బయటకి చెప్పే తత్వం కాదు. నేను దానికి పూర్తిగా ఆపోజిట్. రవ్వంత తలనొప్పి వస్తే కొండంత ఆర్భాటం చేస్తాను. ఇలా పుస్తకం రాస్తే, ఆ వ్యాపకంలో పడితే తన హెల్త్ ప్రాబ్లమ్స్ కొంతవరకు మరచిపోతుందని నా ఉద్దేశ్యం. కానీ స్ట్రెయిన్ అవుతుందేమోనని భయం. రెండు రోజులు రాసి చెయ్యి నొప్పని, నడుము నొప్పని మానేస్తుందనుకున్నాను. కానీ జరిగింది వేరు.

ఐడియా వచ్చిన తక్షణం ఆవేశం ఉప్పెనలా పొంగింది. వాడకుండా ఉన్న టి.టి.డి డైరీని తీసుకుని రాయడం మొదలెట్టింది. పది పేజీలు రాసి, చదివి వినిపించింది. స్టన్ అయ్యాను. ఇదేదో నాలుగు వాక్యాలు చేరదీసిన పుస్తకం కాదు ఒక అనుభవం. అర్ధరాత్రి లేచి ప్రక్కన చూస్తే ఉండేదికాదు. లౌంజ్‌లో రాసుకుంటూ ఉండేది. మధ్యాహ్నం నిద్రరాకపోతే, వెంటనే పుస్తకం తీసి రాసేసేది. ఆరునెలలకు పుస్తకం పూర్తయింది. కల్యాణి కళ్ళల్లో సెన్స్ ఆఫ్ అఛీవ్‌మెంట్ కనిపించింది. చాలామంది నా జీవిత చరిత్రను రాయమని సలహా ఇచ్చారు. బద్ధకమో, మరెందువల్లనో అది ఇంతవరకు జరగలేదు. అయినా నా జీవిత కథలో ఏముంటుంది గనుక – ఎక్కువ భాగం నా సినిమా వృత్తిలోని విశేషాలు, సెలబ్రిటీల పేర్లు. అక్కడక్కడా వినోదాన్ని పంచే సన్నివేశాలు. సరదాగా చదువుకోవడానికి బాగుండవచ్చు.

ఎంతసేపూ ఒకే రంగు కనిపిస్తుంది. కానీ జీవితంలోని అన్ని రంగులను ఆస్వాదించాలంటే కల్యాణి రాసిన పుస్తకంలో అవన్నీ నాకు కనిపించాయి. దీన్ని చదివిన వాళ్ళు కూడా నాలాగే ఫీలౌతారనుకుంటున్నాను.

**సింగీతం శ్రీనివాసరావు**

***

**మనసులోని మాట**



ఇదంతా మొత్తం నా యద్ధార్ధ గాధ. కల్పితాలేవీ లేవు. అతిశయోక్తులంతకన్నా లేవు. ఎటొచ్చీ నా ఆత్మ సంతృప్తి కోసం, నా జీవితాన్నంతా ఒక సింహావలోకనం చేసుకున్నానంతే. అసలు నా ఈ జీవిత చరిత్ర రాయమని ఐడియా ఇచ్చినది నా రెండవ కూతురు సుధ. చెల్లెలు చెప్పిన సలహా కరెక్టని చెప్పింది మా శకుంతల. వెంటనే మావారు బాగా ప్రోత్సహించారు. దీంతో నాకు ఏనుగు బలం వచ్చింది. నాలో ఏం చూసి నన్ను రాయడానికి పురికొల్పారో నాకిప్పటికీ అర్ధం కావడంలేదు. మా సుధ చెప్పడం ఏమిటి? ఈయన తందానతానంటూ నన్ను ప్రోత్సహించడం ఏమిటి? నాకైతే ఇదంతా వింత స్వప్నంలా అనిపిస్తోంది. నేనేనా ఈ ఆరునెలలూ ఇదంతా రాసినదీ అనిపించింది. కానీ ఇది రాస్తున్నంతసేపూ కొన్నిసార్లు బాధ వేసి కన్నీళ్ళూ వచ్చాయి. కొన్నిసార్లు నాలో నేనే నవ్వుకున్నాను. ఒకటి రెండు సార్లు కోపం కూడా వచ్చింది.

పెళ్ళికి ముందు మా నాన్నగారు కొన్ని విషయాలలో నన్ను ఉత్సాహపరిచి చిన్న మొక్క వేసి దాన్ని చిగురింపచేసారు. పెళ్ళయి వచ్చిన తర్వాత మా వారు తనతో కూడా ఆయన రచన, వ్యాసాలు, మాటలు, సంభాషణలలో శిక్షణ ఇచ్చి, చేయూతనిచ్చి, మా నాన్నగారు నాటి చిగురించిన మొక్కని పెంచి, పెద్దచేసి, పెద్ద పెద్ద కొమ్మల్ని తయారుచేశారు. తర్వాత నా జీవితం మూడు పువ్వులూ ఆరుకాయలుగా తయారై, భర్త ప్రోత్సాహంతో నాలో దాగి ఉన్న ఆత్మ విశ్వాసాన్ని వెలుపలికి రప్పించి, నన్ను ఎంతో పరిజ్ఞానం ఉన్న మనిషిలా తీర్చిదిద్దింది. నేను రాసిన దాంట్లో ప్రత్యేకత ఏమీ లేకపోయినా, ఎందుకో మావారిచ్చిన ప్రోత్సాహం వలన నాలో ఉత్సాహం, ఆత్మబలం వచ్చి, నా కలం నన్ను ఈ విధంగా రాసేటట్లు చేసింది. ఇది చదివే పాఠకులందరికీ నా ధన్యవాదాలు. ఇదేకాదు పెళ్ళికి ముందర, పెళ్ళయిన తర్వాత మాతో కొంతకాలం గడిపిన మా చెల్లెలు చి.సౌ రఖుమకి, నా కూతుళ్ళకి, నేను మర్చిపోయిన కొన్ని సంఘటనలు గుర్తుచేసినందుకు వాళ్ళకి నా ఆశీర్వాదములు.

**సింగీతం లక్ష్మీ కల్యాణి.**

# శ్రీ - కల్యాణీయం



**పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మ రతాయచ**

**భజతాం కల్ప వృక్షాయ నమతాం కామధేనవే**

నేను కల్యాణిని. పూర్తిపేరు లక్ష్మీ కల్యాణి. 1936 సంవత్సరంలో అక్టోబరు 9 కాకినాడలో పుట్టాను. నా తల్లిదండ్రులు యలమర్తి విఠల్‌రావుగారు, శ్రీమతి ప్రఫుల్ల. కాని చాలామందికి మా అమ్మ పేరు తెలీదు. మేము కన్నడ మధ్వులం. మా అమ్మమ్మకి పిల్లలు పుట్టి పుట్టి నలుగురైదుగురు చనిపోవడం వల్ల మా అమ్మని పుల్లమ్మ అని పిలిచేవారు. కానీ మా నాన్నగారు మాత్రం పుల్లీలూ అని పిలిచేవారు. నా బాల్యమంతా కాకినాడ, రాజమండ్రి, బెజవాడలో గడిచింది. నాకు అయిదారు సంవత్సరాలు వచ్చేసరికి నెల్లూరు జిల్లా అల్లూరికి వచ్చాము. అక్కడ మా నాన్నగారు స్కూల్ మాస్టరుగా పనిచేసేవారు. రెండు మూడేళ్ళు అక్కడ గడిచిపోయింది. తర్వాత నెల్లూరికి వచ్చాము. నెల్లూరులో సెంట్ పీటర్స్ హైస్కూల్లో మా నాన్నగారు ఉద్యోగం చేసారు. మా పెద్ద చెల్లెలు సుశీల 1939లో నరసీపట్నంలో పుట్టింది. తర్వాత మూడేళ్ళకి ఒక ఆడపిల్ల పుట్టి దానికి మూడేళ్ళ తర్వాత లివర్ జబ్బుతో చనిపోయింది. ఆ తర్వాత మూడేళ్ళకి మా అమ్మకి మగపిల్లవాడు పుట్టాడు. అపురూపంగా మనవడు పుట్టాడన్న సంతోషంతో మదరాసులో టీచరుద్యోగం చేస్తున్న మా తాతగారు అదేపనిగా సెలవు పెట్టి మదరాసు నుంచి వచ్చారు. నామకరణం మా నాన్నగారు ఉన్నంతలో చాలా వైభవంగా చేశారు. మా నాన్నగారి స్టూడెంట్స్ ఒక్కొక్కళ్ళు ఇళ్ళనుండి అరటికాయలు, అరటిపండ్ల గెలలు, పండ్లు, పాలు పెరుగు అన్నీ పంపించారు. అవన్నీ వాళ్ళ ఇళ్ళల్లోవే. ఎందుకంటే ఆ కాలంలో చాలామంది ఆవులు, గేదెలు, పాడి, పంట ఇంట్లోనే పెట్టుకునేవారు. నామకరణం అయిన తరువాత అందరూ చాలా సంతోషించాం. కానీ ఆ సంతోషం ఎన్నాళ్ళో మిగలలేదు. ఆ పసివాడు పధ్నాలుగురోజులకే చనిపోయాడు. ఆ బెంగతో మా తాతగారికి క్రమేపి ఆరోగ్యం క్షీణించసాగింది. మదరాసుకు పిల్చుకు వెళ్ళి వైద్యం చేయించినా ఫలితం లేక కొన్నాళ్ళకి చనిపోయారు. నా చిన్నతనంలోనే నేనీ కష్టాలన్నీ చూడవలసి వచ్చింది.

మా తాతగారి పేరు పార్శీ వెంకోబరావుగారు, మా అమ్మమ్మ పేరు పార్శీ కమల. మా నాన్నగారి తండ్రిపేరు యలమర్తి సుబ్బారావుగారు, తల్లి లక్ష్మీబాయమ్మ. కానీ వారిద్దరినీ నేను చూడలేదు. మా నాన్నగారి తండ్రి మా నాన్నగారి చిన్నతనంలోనే పోయారట. తల్లి ఇంకొన్నాళ్ళుండి పోయిందట. మా తాతగారికి నేనన్నా, నాకు తాతగారు, అమ్మమ్మలన్నా చాలా ఇష్టం. అసలు నిజానికి ఆయన బ్రతికుండగా కలలు కనేవారు. నన్ను వాళ్ళ దగ్గర పెట్టుకుని మదరాసులోనే చదివించాలని ఆయన కోరిక. నేను పెద్దయిన తర్వాత నాకు

పెళ్ళయి మదరాసుకు రాగానే మా తాతగారే జ్ఞాపకం వచ్చేవారు. ఈ విధంగానైనా ఆయన ఆత్మకి శాంతి లభించిందనుకునేదాన్ని. మా అమ్మమ్మ, తాతగారు మదరాసులో ఉంటూ ఉండేవారు. అంతకు ముందు నర్సీపట్నంలో చాలా సంవత్సరాలుండి ఆఖరుకి మదరాసు చేరారు. వాళ్ళకి మగపిల్లలు లేరు. మా అమ్మా నాన్నలకు కూడా మగపిల్లలు లేరు. నాకు మగపిల్లలు లేరు. మా అమ్మకి ముగ్గురాడపిల్లలు. నాకు ఇద్దరాడపిల్లలు. మా పెద్ద చెల్లెలికి మాత్రం ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి. మా చిన్న చెల్లెలికి ముగ్గురూ ఆడపిల్లలే. ఆఖరుకి దాని ముగ్గురు కూతుళ్ళకీ ఆడపిల్లలే. మా చెల్లెలికి నలుగురు మనవరాళ్ళు. మా తాతగారు, అమ్మమ్మ అప్పుడప్పుడు నెల్లూరు వచ్చి మాతో గడుపుతూ ఉండేవారు.

మా నాన్నగారి సొంత చెల్లెలి పేరు సీత. మా నాన్నగారి పెద్దమ్మ కూతురు పేరు కల్యాణి. కానీ, కల్యాణి అంటే మా నాన్నగారికి పంచప్రాణాలు. "నాకన్నా ఆ కల్యాణే నీకెక్కువా అన్నయ్యా?" అంటూ మా అత్త అసూయపడేదట. కల్యాణి అత్తవారు విశాఖపట్నం. కల్యాణి ముగ్గురు కూతుళ్ళని కని చిన్నతనంలోనే చనిపోయిందిట. అందువలన మా నాన్నగారు తన తల్లిగారి పేరు లక్ష్మి, చెల్లెలు కల్యాణి పేరు రెండూ జత చేసి లక్ష్మికల్యాణి అని నాకు పెట్టారుట. కానీ, పెళ్ళికి ముందు నేను లక్ష్మిగా చలామణి అయ్యాను. అందరూ నన్ను లక్ష్మి అని పిలిచేవారు. పెళ్ళయిన తరువాతనే కల్యాణినయ్యాను. పెళ్ళి చూపులయింతరువాత మా మామగారు బయలుదేరేటప్పుడు "సరేనమ్మా కల్యాణి, వస్తాం" అన్నారు. ఈ విషయం మా అమ్మమ్మతో చెబితే "అయితే మీ అత్తవారింట్లో నిన్ను కల్యాణి అనే పిలుస్తారన్నమాట" అంది చిరునవ్వుతో.

మా అమ్మమ్మ తాతగారి తరాలలో వారందరిది ఉమ్మడి కుటుంబం. మంచి అయినా చెడు అయినా అందరూ ఒకచోట కలవాల్సిందే పైగా ఆకాలంలో తల్లీ కూతుళ్ళు ఒక్కసారిగా ప్రసవించేవారట ఇంట్లో రెండు పురిటి మంచాలుండేవిట. చాకిరీ చెయ్యలేక మిగతా వాళ్ళ పని అయిపోయేదిట. అప్పట్లో ఆస్పత్రి సౌకర్యాలు లేవుగా. ఇంట్లో పురుళ్ళు పోసేది మంత్రసానులే. ఇలా ఒకసారి మా తాతమ్మగారు పోతే అందరూ బెజవాడలో చేరవలసి వచ్చింది. ఆ కాలంలో పార్థీవారంటే చాలా పేరున్న కుటుంబం. మా తాతగారి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, వాళ్ళ కుటుంబాలు అందరూ బెజవాడలో ఉన్న మా చినతాతగారు పార్థీ శేషగిరిరావు గారి ఇంట్లో చేరేవారు. వాళ్ళంతా మైలవాళ్ళే. మా నాన్నగారు యలమర్తి కుటుంబం వలన మాకు మైల లేదు. కానీ నేను పిల్లలతో కలిసి ఆడుకోడానికి నా గౌన్లు కొన్ని వాళ్ళ దగ్గర పెట్టి ఆడుకునేదాన్ని. ఆడుకునేంతవరకు ఆడుకుని ఆ తర్వాత కొట్టుకుని దెబ్బలాడే వాళ్ళం. కానీ ఆ చిన్నతనపు రోజులు మళ్ళీరావుకదా. కష్టాలు తెలీదు, నష్టాలు తెలీదు. నిజానికి అది ముసలావిడ చనిపోయిన ఇల్లయినా, ఇల్లంతా చాలామంది ఉండడం వలన పెళ్ళిల్లు లాగా ఉండేది.

నెల్లూరులోనే మా నాన్నగారు సెంట్ పీటర్స్ హైస్కూల్లో టీచర్‌గా ఉండేవారు కదా, నేను నెల్లూరులోని ట్రైనింగ్ స్కూల్‌లో చదివేదాన్ని. నేను 5 వ తరగతో, ఏడవ తరగతో గర్ల్స్ ట్రైనింగ్ స్కూల్లో చదువుతున్నప్పుడు, ఒకరోజు నా ఇంగ్లీషు టెక్స్ట్ బుక్ పోయింది. స్కూల్లో, ఇంట్లోను అన్ని చోట్లా వెతికాను. ఇంట్లో చెప్పాను. మా అమ్మ, నాన్నగారు, నాకు నిర్లక్ష్యమని, అందువలన పుస్తకం పోగొట్టుకున్నానని కాస్త చీవాట్లు పెట్టారు. మూడవరోజున నేను, నా స్నేహితురాలు సరోజని, మేమిద్దరం స్కూలు కాంపౌండులోంచి క్లాసుకి వెళ్తుంటే ప్లే గ్రౌండ్‌లో ఒక పుస్తకం నుంచి తీసేసిన అట్ట కనిపించింది. ఎందుకో మాకు సందేహం వచ్చి, నేను వెంటనే పరుగెత్తికెళ్ళి ఆ కవరు చూస్తే, దాంట్లో పుస్తకం లేదు. నా పుస్తకం కవరు లాగుందే అనుకుని చూస్తుంటే దానిపైన అంటించిన లేబుల్ కనిపించింది. ఆ లేబుల్ మీద వై. లక్ష్మి కల్యాణి అని పేరుంది. "సరోజనీ! ఇది నా పుస్తకం అట్టేనే, చూడూ! "అని దానికి చూపిస్తే, సరోజిని, "అయితే నీ పుస్తకం ఆ పుష్పే తీసి ఉంటుంది" అంది. ఈ విషయం నేను టీచరుతో చెప్పడానికి భయపడ్డాను.

ఇంటికి వచ్చి జరిగిన విషయమంతా చెపితే "టీచరుకు చెప్పావా?" అనడిగారు. లేదన్నాను. మర్నాడు మాములుగా స్కూలుకెళ్ళి తలవంచి ఏదో రాసుకుంటున్నాను. టీచరు కుర్చీ దగ్గర నిల్చుని ఉంది. ఉన్నట్టుండి మా అమ్మ గొంతుక వినిపించింది. తలెత్తి చూస్తే మా

అమ్మ. స్కూలుకి వచ్చింది, తనకెలా తెలుసు మా క్లాసు. టీచరేదో అడుగుతోంది మా అమ్మని "మీ అమ్మాయంటే ఎవరు? ఏం పేరు?". మా అమ్మ "లక్ష్మీ కల్యాణి.. అదుగో" అంటూ నావైపు చూపించి, "మూడు రోజుల కిందట దాని పుస్తకం పోగొట్టుకుంది, నిన్న పుస్తకానికి వేసుకున్న అట్ట కనిపించిందిట" అని చెప్పింది.

అప్పుడు టీచరు ఒక్కొక్కళ్ళ పుస్తకాలనీ చెక్ చేస్తూ పుష్ప అనే అమ్మాయి దగ్గరకు వచ్చింది. అప్పటికే ఆ అమ్మాయి కొన్ని దొంగతనాలు చేసేదని కొంతమంది అమ్మాయిలకి తెలుసు. టీచర్ ఆ అమ్మాయినడిగితే "నాదే ఈ పుస్తకం" అని వాదించింది. టీచరు పేజీలు తిరగేస్తూంటే మధ్యలో ఒక పేజీలో లక్ష్మీ కల్యాణి అని రాసి ఉంది. టీచరప్పుడు ఆ అమ్మాయిని తిట్టి పుస్తకం తీసి నాకిచ్చింది. కానీ నాకు మాత్రం ఇంటిలో అంత బెరుకుగా ఉంటున్న మా అమ్మ ఇంత ధైర్యంగా స్కూలుకివచ్చి, పైగా నాక్లాసు ఎక్కడుందో తెలుసుకుని ఎలా వచ్చిందో? ఆవిడ చిన్నతనంలో పట్టుమని కొన్నాళ్ళు కూడా చదువుకోలేదు. స్కూలుకి అంతకన్నా వెళ్ళలేదు. పిల్లలు పోయిపోయి పుట్టడంతో మా అమ్మమ్మ, తాతగారు, మా అమ్మని, పిన్నిని, స్కూలుకి కూడా పంపేవారు కాదుట.

అప్పుడు, అంటే 1947లో మా మూడో చెల్లెలు పుట్టింది. దాని పేరు రఖుమ. నాకూ దానికీ పదకొండు సంవత్సరాలు తేడా అందుకని చిన్నప్పటినుంచి అది నాతో దెబ్బలాడకుండా కొంచెం గౌరవంగా చూస్తుండేది. క్రమంగా పెరిగి పెద్దవాళ్ళయిన కొద్దీ మా చెల్లెళ్ళిద్దరూ దెబ్బలాడుకునేవారు. నేను కొంచెం పెద్దదాన్ని కనుక వాళ్ళ తగువులు తీర్చేదాన్ని. మా సుశీల "అక్క ఏమైనా అంటే ఊరుకుంటావు. నేనేమైనా అంటే అలా గింజుకుంటావు అన్నిటికీ ఏడుస్తావేం? పైగా అమ్మావాళ్ళకి చాడీలు కూడా చెప్తావ్" అనేది.

ఇక్కడ ఒక సంగతి. మా చిన్న చెల్లెలు రఖుమ పుట్టినప్పుడు ఇరవై రోజులకి మా అమ్మకి జబ్బుచేసింది. ఆమెకి ప్రసవం అయిన అమెరికన్ హాస్పటల్‌లోనే ట్రీట్‌మెంటుకి చేరింది. ఒక నెల్లాళ్ళు ఉండవలసి వచ్చింది. రెండురోజులు నోటమాట పడిపోయింది. ఎడమవైపు వాతం వచ్చి స్వాధీనం తప్పిపోయింది. ఊరివాళ్ళు, మా చుట్టాలు అంతా పిల్ల పుట్టిన వేళావిశేషం వాళ్ళమ్మకి జబ్బు చేసింది అని ఆడిపోసుకున్నారు. క్రమేపి జబ్బు నయమై, మాట్లాడ్డానికొచ్చి ఆరోగ్యం చేకూరి ఇంటికి రాగానే, ఆ తిట్టిన నోళ్ళే "పుట్టిన పాప అదృష్టం, తల్లిని బతికించుకుంది" అన్నారు. అలా మా చెల్లెలు పెద్దదవుతూ ఉంది. నేను ట్రైనింగ్ మిడిల్ స్కూల్ నుంచి సెంట్ జోసెఫ్స్ గరల్స్ హై స్కూల్‌కి మారాను. పదవ తరగతి వరకు అక్కడే చదివాను. అంటే మేము నెల్లూరులో చాలా సంవత్సరాలు ఉండిపోయాము.

మా నాన్నగారు M.B.ED, అయినా ఇంకా హై స్కూల్లోనే చెయ్యడం, లెక్చరర్ షిప్ రాకపోవడం ఆయనని చాలా వేధించేది. అక్కడా, ఇక్కడా ట్రై చేస్తూ వచ్చారు. కొన్నాళ్ళకి 1951లో భీమవరం కాలేజీలో లెక్చరర్‌గా జాయిన్ అయ్యారు. అప్పుడు దాని పేరు W.G.B.College అంటే West Godavari Bhimavaram College కొన్నేళ్ళ తర్వాత D.N.R.Collegeగా మారింది. దంతులూరి నారాయణ రాజు కాలేజ్. కానీ నాది, మా సుశీల చదువుల వల్ల మకాం నెల్లూరు నుండి భీమవరంకి మార్చలేకపోయాము. ఒక సంవత్సరం మా నాన్నగారు భీమవరంలో ఒంటరిగానే ఉంటూ వచ్చారు. నా పదవతరగతి వేసవి సెలవులకి మొత్తం మీద నెల్లూరు నుంచి భీమవరంకి మకాం మార్చాము. అప్పటికింకా మా చిన్న చెల్లెల్ని నాలుగేళ్ళేకదా అని స్కూల్లో చేర్పించలేదు. ఆ రోజుల్లో అయిదు సంవత్సరాలకి కానీ పిల్లల్ని స్కూల్లో చేర్పించేవాళ్ళు కాదు. ఇంటి దగ్గరే అయిదవ క్లాసు వరకు మాష్టర్ని పెట్టి చదివించారు. S.S.L.C నేను భీమవరం U.L.C.M.(Christian) Schoolలో చదివాను.

స్కూల్ ఫైనల్ అవగానే కాలేజీలో చేరాలి కదా! ఆ కాలేజీ కో - ఎడ్యుకేషన్ అయినందువలన మా నాన్నగారికెందుకో నన్ను కాలేజీలో చేర్పించడానికి ఇష్టం లేకపోయింది. ఆయన కొన్ని విషయాలలో స్ట్రిక్ట్‌గా ఉండేవారు. ఇరుగుపొరుగు మగపిల్లలతో చనువుగా మాట్లాడరాదు. వెకిలి నవ్వులు నవ్వరాదు. ఇలా ఆంక్షలు విధించేవారు. మళ్ళీ బజార్లకి, మా అమ్మ వాళ్ళతో సినిమాలకీ పంపించేవారు. స్నేహితులతో కలిసి వెళ్ళడం అవేవీ జరగలేదు. కానీ కొన్ని విషయాలలో ఎంకరేజ్ చేసేవారు. మహిళా మండలిలో చేరి మేము టైపు, మ్యూజిక్, మా చిన్న చెల్లెలు డ్యాన్స్ ఇవన్నీ నేర్చుకునేవాళ్ళం. మా రఖుమ డాన్స్ ప్రదర్శనలు ఇచ్చేది. భీమవరం చుట్టుపక్కల ఉన్న

వీరవాసరం మొదలైన ఊళ్ళలో అది కన్యకా పరమేశ్వరిగా, అప్పటి A.C.T.O కూతురు కల్యాణి శివుడుగా, డ్యాన్సు ప్రదర్శనలు ఇచ్చేవారు. వాళ్ళిద్దరికీ చాలామంచి పేరొచ్చింది. నేను, మా సుశీల మహిళా మండలి ఆధ్వర్యంలో సంగీత కచేరీలు - కర్ణాటక సంగీతం కూడా చేసేవాళ్ళం. అప్పటి మా సంగీతం మాష్టారు ఉప్పలపాటి సూర్యనారాయణగారు. చెంబై వైద్యనాథన్ భాగవతార్‌గారి శిష్యుడు. ఇంటివద్ద కూడా రెండేళ్ళు ఆయన చేత సంగీత పాఠాలు చెప్పించుకున్నాము. నేను మహిళా మండలిలో కొన్నాళ్ళు జాయింట్ సెక్రటరిగా కూడా వెలగొపెట్టాను.

ఇవన్నీ ఇలా ఉండగా మా నాన్నగారికి సడన్‌గా ఒక ఆలోచన తట్టింది. హైదరాబాదులో మాకు వరుసకి మేనమామ పి.ఎస్.రావ్ ఆంధ్రజనతా డైలీ పేపర్‌లో పనిచేసేవారు. అతనితో మాట్లాడి నన్ను భీమవరం కరస్పాండెంట్‌గా చెయ్యాలని ప్రోత్సహించారు. నేను మాత్రం పెద్ద పెద్ద సభలకి, పొరుగూర్లకి వెళ్ళకుండా ఇన్‌ఫర్మేషన్ రాబట్టి, ఊళ్ళోని మీటింగ్స్‌కి, ఫంక్షన్స్‌కి మా లేడీస్ క్లబ్ మీటింగ్స్, ఫంక్షన్స్ అటెండు అయి అవన్నీ ఆంధ్ర జనతా పేపర్‌కి పంపేదాన్ని. అవన్నీ పబ్లిష్ అయ్యేవి. నాకు స్టాంపుల ఖర్చు అయింది. కానీ అఫీషియల్‌గా హైదరాబాదు నుండి ఒక్క పైసా కూడా రాలేదు. మా నాన్నగారు మాత్రం "డబ్బు కోసమా? నీకు జర్నలిజం అలవాటవుతోంది కదా!" అనేవారు. కానీ ఆయన ప్రొత్సాహంతో నా ముున్ముందు లైఫ్‌లో నా రచనలకు దారితీస్తుందని అప్పుడు ఊహించలేకపోయాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments